
# రాజ్యలక్ష్మి



**ఆ ఊరికి** నన్ను డాక్టరుగా బదిలీ చేశారు. హాస్పిటలులో అడుగు పెట్టగానే అక్కడి ఉద్యోగులందరూ నన్ను కొత్తగా చూస్తూ నమస్కారాలు చేశారు మర్యాదాసూచకంగా. అందరినీ చూచి చిరునవ్వుతో కుర్చీలో కూర్చున్నాను.

నేను వెళ్ళిన రెండు నిమిషాలకు, ఒక నర్సు వచ్చి నా టేబిల్‌కు ఎదురుగా నిలుచున్నది. నన్ను చూస్తూనే ఆమె కళ్ళు విప్పారినట్లు అయ్యాయి. తరవాత నాకు విష్‌చేసి వెళ్ళిపోయింది. మొదట్లో, ఆమె సంగతి నే నంతగా గమనించలేదుగాని, క్రమేణ ఆమె అక్కడ ప్రత్యేకంగా గౌరవించబడుతున్నట్లు తెలుసుకోగలిగాను.

ఆమె పేరు లక్ష్మి. లక్ష్మి అంటే హాస్పిటల్‌లో

ఉద్యోగులందరూ గౌరవంగా చూస్తారు. అక్కడికి వచ్చే పోయే ఉద్యోగులు ఆమెను ఓ దేవతగా భావించి పూజ్యభావంతో చూస్తుంటారు. శాంతి గంభీరతలు ఉట్టిపడే ఆమె వదనంలో ఎల్లవేళలా మందహాసం వెల్లి విరిస్తూంటుంది. చక్కని శరీర సౌందర్యంతో, తెల్లగా మృదువుగా ఉన్న చేతులతో, విసుగు విరామము లేకుండా రోగులకు సేవ చేస్తున్న లక్ష్మిని నేను చాలాసారులు చూచాను.

ఆమె ప్రవర్తనకు, పైపెచ్చు ఆమె అందానికి నేను ముగ్ధుడినైనాను. కాని, ఎప్పుడైనా అవసరం వస్తేగాని ఆమె నాతో మాట్లాడటంగాని, నా కంట బడటం గాని జరగలేదు. అయినా, ఆమెను చూచి నప్పుడు, తీర్చినట్లున్న కనుబొమ్మలకింద విశాలము లైన ఆ కళ్ళు నాకు ఏమిటో జ్ఞప్తికి తెచ్చేట్లుకనిపిం చాయి. కాని, నా నిత్య జీవితంలో పడి ఆమెన్గురించి ఏ విధమైన ఆలోచన పెట్టుకోలేక పోయాను.

ఆ ఊరు కొత్త అయినా నాకు బాగానే గడిచి పోతున్నది. నాకు మొదటినుండి ఎక్కువగా స్నేహి తులతో కాలం గడపటం కాని, బయటి ప్రపంచంతో సన్నిహిత సంబంధాలుకాని అలవడలేదు. బహుశా ఆ అలవాటే నాకు కొత్త ప్రదేశాలలో ఉపకరిస్తున్న దనుకుంటాను. అది సుమారుగా పాటి గ్రామమైనా అందంగానే ఉన్నది. ప్రస్తుతం నేను బ్రహ్మచారినే కాబట్టి వేళకు ఇన్ని హోటలు మెతుకులు తిని హాస్పి టల్ ఆవరణలో ఉన్న నా ప్రత్యేక గృహంలో నివసి స్తున్నాను.

ఒకనాటి ఉదయం నేను హాస్పిటల్‌కు వచ్చాను. నా సీటు దగ్గిరికి నడుస్తున్న నా దృష్టి పక్కనే ఉన్న గదిలోపలికి మళ్ళింది. ఆశ్చర్యంతో అడుగు ముందుకు వెయ్యక అలాగే నిలబడిపోయాను అక్కడ. ఆమె, అంటే లక్ష్మి కూర్చుని ఉన్నది. చెంపను చెయ్యి చేర్చి, మోచేయి బల్లకు ఆనించి, తల పైకెత్తి ఎక్కడికో శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఉన్న ఆమె వైఖరి నాకు విస్మయం కలిగించింది. నాకు తెలియకుండానే ఆమె ఎదటికి వెళ్ళి నిలుచున్నాను.

ఆమె తలెత్తి నావైపు చూచింది. తెల్లబోతూ, చటుక్కున లేచి నిలబడింది.

నేను చొరవగా, "క్షమించు! నిన్ను ప్రశ్నించేందుకు నాకేం అధికారం లేదు. కాని, ఎంతోమంది వ్యథిత హృదయాలకు నీ చల్లని వాక్కులతో ఉపశమనం కలగజేస్తూ, అలవికాని బాధలతో అలిసి కన్నీరు కార్చే రోగార్తులను వాత్సల్యంతో లాలించి ఓదార్చే నీ వదనంలో కూడా ఏదో బాధ పొడచూపడం వింతగా ఉన్నది!" అన్నాను.

ఆమె తల ఎత్తి ఒక్కసారి నా ముఖంలోకి చూచింది. తరవాత ఎంతో మెల్లిగా, "మీ వాత్సల్యానికి కృతజ్ఞు రాల్ని" అనేసి అక్కడినుండి చరచరా వెళ్ళిపోయింది.

ఆమె వింతచర్యకు మరింత విస్తుపోయాను. ఆత్మీ యంగా పలకరించిన నాకు ఒక్క మాటతో జవాబిచ్చి తప్పించుకుపోయింది ముభావంగా. ఎదటివారి కష్టాల్ని చూచి ఓర్వలేని దయామయి ఈమె మనస్సు ఇంతగా నొప్పించిన దుర్మార్గు లెవరు? ఎంత ఆలో చించి గింజుకున్నా ఆమెలో అస్పష్టంగా మెదులుతున్న వ్యథ ఏమిటో గ్రహించలేకపోయాను.

**ఒక మనిషి ఎవరినైనా పూర్తిగా అర్థం చేసుకోనడం అసంభవమే అని చెప్పవచ్చు. అసంభవాన్ని సంభవంచేసే శక్తి ప్రేమకు ఉంది అంటే ప్రేమ చూపగలవారు, ప్రేమ పారమ్యం అనుభవించినవారు జీవితంలో అన్నివిధాలా వంచింపబడినా మరొక ఆలంబనం మాత్రం అన్వేషించరు ఆ అనుభవం వారికి ఇచ్చే బలం ఆత్మవిశ్వాసం. సంతృప్తి, సానుభూతి అంతటివి.**

గాఢనిద్రలో ఉన్నాను. ఎవ్వరో తలుపు తట్టు తున్నట్లయి ఉలిక్కిపడి లేచాను. "డాక్టర్!" అన్న పిలుపు మెల్లిగా వినవచ్చింది. చేతివంక చూచాను. వాచీ పదకొండు సూచిస్తూంది. చటుక్కున లేచి, స్లిప్పర్లలో కాళ్ళు దూర్చి వెళ్ళి తలుపు తీశాను. వాకిట్లో లక్ష్మి నిల్చుని ఉన్నది.

"నర్స్! నీవా?"

"వెరీ సారీ! మధ్యాహ్నం మీరు ఆపరేషన్ చేసిన మనిషి చాలా బాధపడుతున్నాడు. అతనికి ఈ ఇంజె క్షన్‌లలో ఏది ఇవ్వాలో చెప్పండి?" అంటూ చేతిలో ఉన్న రెండు సీసాలు చూపించింది.

నేను ఒక్క క్షణం ఆమె వేపు చూచి, "పద. నేనూ వస్తాను" అన్నాను.

తరవాత రోగి గదినుండి బయటికి వచ్చి, "నర్స్, నీవు ఇంతవరకూ ఇక్కడనే ఉన్నావు కదూ?" అన్నాను అసంగతంగా.

ఆమె జవాబుగా మందహాసం చేసింది.

ఇరువురమూ వరండాలోకి వచ్చాము. అక్కడ ఒకామె నిలబడలేనట్లు, వరండా స్తంభానికి ఆనుకు నిలబడి ఉన్నది. నర్సును చూచి, "రాజీ, ఇంక రా అమ్మా. అర్ధరాత్రి కావస్తున్నది" అన్నది శక్తిలేనట్లు హీన స్వరంతో.

లక్ష్మి గాభరాగా వెళ్ళి ఆమె చేయి పుచ్చుకున్నది. "వచ్చావా! నేను అనుకుంటూనే ఉన్నాను, అమ్మా! ఎంత మొత్తుకొని చెప్పి వచ్చాను, అంత దూరంనుండి నడిచి రావద్దని?" అంటూ ఆ వ్యక్తిని మెల్లిగా నడి పించుకొంటూ పోసాగింది. వెళ్ళేవారిని చూస్తూ నిశ్చ లంగా నిలబడిపోయాను నేను. కొంతసేపటిలోనే వరండా లైటు ప్రసారంలో అస్పష్టంగా కనిపిస్తున్న వారిరువురూ హాస్పిటల్ గేటు దాటి పోయారు.

క్షణం క్రితం విన్న వారి పలుకులు, కనుమరుగైన వారి మూర్తులు నాలో ఒక విధమైన సంచలనం కలి గించాయి. అప్రయత్నంగానే అడుగులు ముందుకువేసి వారిని అనుసరించాను. వారు నాకు అయిదారు గజాల దూరంలో నడుస్తున్నారు. లక్ష్మి అంటున్నది: "అమ్మా! అనవసరంగా ఇంతదూరం నడిచివచ్చావు. ఇంక బాధతో మూలుగు ప్రారంభిస్తావు కదూ? ఏమిటో ఎంతచెప్పినా వినవు కదా!"

"ఆస్పత్రిలో కాలుపెడితే ఇంక ఇల్లూ తిండీ కూడా మరిచిపోతావు. ఇంటికి వస్తే నా చాకిరీ ఉండనే ఉంది. ఎంతకీ ఇతరుల్ని గురించే కాని, నిన్ను గురించి నీకు శ్రద్ధే లేదు కదా, రాజీ! ఎలా బ్రతుకుతావమ్మా! ఇంత వెర్రి తల్లిని ఇచ్చాడెందుకో భగవంతుడు నాకు!" తల్లి బాధాపూరిత స్వరంతో అంటూంటే, లక్ష్మి

**బిరుదరాజు బాలాజిరాజు**

నిష్పృహగానవ్వినట్లున్నది. ఆకంఠస్వరం ఎక్కడో విన్నట్లు అనిపించింది. అసలు, మొదట ఆ గొంతు విన్న క్షణం లోనే నేను ఆకర్షించబడి, అలా వారి వెంట నడుస్తున్నాననికూడా గ్రహించాను. అందుకే, కౌతుకంగా అడుగులు వేశాను. వారు తమ ఇల్లు సమీపించారు. ఇరువురూ లోపలికి వెళ్ళారు. నేనూ వెళ్ళి ద్వారం ఈవ లగా నిల్చున్నాను. తల్లి మంచంలో కూలబడింది. "చూడమ్మా. ఊరంతా నిద్రపోయింది. నీవు మాత్రం ఇంతవరకూ తిండి తినలేదు" అన్నది, ఉస్సురని నిట్టూ రుస్తూ. లక్ష్మి అక్కడినుండి మౌనంగా గదిలోకి వెళ్ళింది.

లక్ష్మి దీనజన సేవానిరతికి నా మనస్సు అంజలి అర్పించటం కొత్తకాదు. కాని, అక్కడ మంచంలో కూర్చుని ఉన్న ముసలి స్త్రీ వదనం నాకు లైటు వెలుగులో స్పష్టంగా కనిపించి, హఠాత్తుగా పాత జ్ఞాపకాలు గుర్తుచేసింది! ఇంతవరకూ లక్ష్మిని ఫలానా అని గుర్తించలేనందుకు పశ్చాత్తాపమూ, ఇప్పుడు గ్రహించగలిగినందుకు సంతోషమూ కలిగాయి. గబు క్కున లోపలికి చొరబడ్డాను.

"ఎవరు?" అని ఆశ్చర్యంగా చూస్తున్న తల్లి వద్దకు అప్పుడే బట్టలు మార్చుకొని వచ్చింది లక్ష్మి. ఆమె కూడా క్షణం నన్ను విస్మయంగా చూచి నా ముఖంలో మెదిలే భావాలను అర్థం చేసుకున్నదేమో చిన్నగా నవ్వింది.

"అమ్మా, వారు డాక్టరుగారు" అని నాతో, "కూర్చోండి" అంది గౌరవం ధ్వనించేలా.

నేను వెళ్ళి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాను. ముసలి ఆమె కంగారుగా లేవబోతూ, "మీరా బాబూ! నేను ఎవరో అనుకున్నాను" అంటూంటే, నేను వారించి, "కూర్చోండి. ఫర్వాలేదు. నేను మీ అమ్మాయికి మాత్రమే డాక్టరును. మీరు లేవవద్దు" అన్నాను.

"మాట్లాడుతూండండి. నేను భోజనంచేసి వస్తాను" అని లోపలికి పోయింది లక్ష్మి. ఆమెను చూస్తూంటే నన్ను ఆమె మొదటి నాడే గుర్తించినట్లు గ్రహిం చాను.

ముసలిఆమె వినయంగా, "చూడండి, డాక్టరుబాబూ" అంటూ ఏదో చెప్పబోయింది. చటుక్కున నేను లేచి వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకుని, "ఇప్పుడు చెప్పానుగా నేను మీ కుమార్తెకు మాత్రమే డాక్టరునని? నన్ను మీరు భాస్కరం అని మాత్రమే పిలవండి" అని ఆమె పక్కనే కూర్చున్నాను.

ఆమె తెల్లబోతూ నా ముఖంలోకి అట్టే చూచింది. ఆ తరవాత ముఖం ఇంత చేసుకుని, "ఏమిటీ! నీవు భాస్కరానివా! కమలం కొడుకువా, నాయనా, నువ్వు! నేను గుర్తించలేకపోయాను. విన్నాను, విన్నాను. ఈ మధ్య ఎవరో చెప్పారు, బాబూ, నీవు డాక్టరువయ్యావని" అంది సంబరపడిపోతున్నట్లు.

ఆమె చొరవగా నా భుజంమీద చెయ్యి వేసి నిమురుతూ, "మీ అమ్మ కడుపు చల్లగా ఎంతవాడవయ్యావు, భాస్కరం! కాకపోతే, మా రాజ్యం బ్రతుకు ఇలా కూలిపోయింది గానీ" అంటూ పొంగివచ్చే దుఃఖంతో వెక్కివెక్కి ఏడ్చింది. నేను నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను.

• • •

ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష వ్రాశాను. స్కూలుకూ, చదువుకూ కట్టుబడి ఉన్న నా జీవితానికి కాస్త తెరిపి దొరికింది. చుట్టపు చూపుగా వచ్చిన మా బామ్మ, "ఈ సెలవుల్లో తప్పితే మళ్లీ పంపరు. పిల్లల్ని నేను తీసుకువెడతాను. తరవాత బడి తెరవగానే వచ్చేస్తారు" అని అమ్మనూ, నాన్ననూ ఒప్పించి నన్నూ, చెల్లెలు విమలనూ, తమ్ముడు బాబిగాణ్ణీ వెంటబెట్టుకొని బయలుదేరింది. స్టేషన్‌లో దిగి, బామ్మగారి ఊరు వెళ్లాలంటే మూడు మైళ్ళు నడిచి వెళ్లాలి. ఈ లోపల బడలిక తీరేందుకు స్టేషన్ సమీపంలో బామ్మకు పరిచయం ఉన్న వారి ఇల్లు ఒకటి ఉన్నది. ఎప్పుడైనా మేము వచ్చేపోయే టప్పుడు అక్కడనే మకాం వెయ్యడం మామూలు.

చిన్న డాబా. వరండా. వాకిటి ముందర నీటుగా కట్టిన గిలక బావి. దారిని పోయేవారంతా అడగకుండానే అక్కడ ఉన్న బొక్కెనతో చేదుకొని, చల్లగా తియ్యగా ఉన్న ఆ బావి నీరు తాగిపోతూంటారు. ఇంటిచుట్టూ మామిడిచెట్లు చిన్న తోటలాగ ఉంటాయి.

మమ్మల్ని చూస్తూనే కాంతమ్మ గబగబా ఎదురుగా వచ్చి ఆహ్వానించింది. "ఏం పిన్నీ, కమలం రాలేదా? వీళ్ళు ఆమె పిల్లలేనా?" అన్నది బామ్మతో. బామ్మ, "అవునమ్మా. అది రావటానికి తెరిపి ఎక్కడ? గంపెడు సంసారం అదీను" అంది.

"అవునే. దాన్ని చూచి కూడా చాల రోజు లయింది" అంటూ కాంతమ్మ పిల్లలకూ, బామ్మకూ భోజనం పెట్టింది. నేనుమాత్రం అలా ఊరిలోకి షికారు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చాను. అప్పటికి కూడా బామ్మకూ కాంతమ్మకూ కబుర్లు తెగలేదు. నన్ను చూడగానే కాంతమ్మ, "అమ్మాయీ, రాజీ! భాస్కరం వచ్చాడు. భోజనం పెట్టమ్మా" అని నాతో, "వెళ్లి తినుబాబూ" అంది.

నేను వెళ్లి వంట ఇంటిలో పీట మీద కూర్చొన్నాను. రాజ్యం అంటే కాంతమ్మ కూతురు. తెల్లగా బొద్దుగా చక్కగా ఉంటుంది. తెల్ల పరికిణీ మీద సన్న చుక్కల వాయిల్ పమిట వేసుకున్నది. విస్తరిలో అన్నం కొద్దికొద్దిగా వడ్డిస్తూ నా ముఖంలోకి చూడసాగింది. "ఇది తాలింపు, ఇది పచ్చడి. వెయ్యమంటావా? ఇది పులుసు. వెయ్యమంటావా? ఆవకాయ కావాలా?" అని ప్రశ్నలు వెయ్యసాగింది. నాకు నవ్వు వచ్చింది. "నా మొహంలాగే ఉంది నీ వడ్డన! అవన్నీ ఇలా పడవెయ్యి. కావలసింది తింటాను" అన్నాను. దానితో బాగా కోపగించుకుంది ఆ అమ్మాయి. "అలాగే! ఏవీ మిగిల్చి పారవెయ్యకూడదు. తెలిసిందా!" అంటూ ముక్కు ఎగిరేసి వెళ్లింది.

మారు వడ్డించటానికి రాజ్యం ఎంతకూ రాలేదు. చివరికి నేనే, "అన్నం" అంటూ కేకేశాను. వరండాలో ఉన్న కాంతమ్మ, "ఒసేవ్! పిలిచిందాకా అన్నం పెట్ట

# రాజ్యలక్ష్మి

క్కర్లా!" అంటూ కేక పెట్టేటప్పటికి రాజ్యం విసురుగా వచ్చి, ముఖభంగిమలు గమనించ నియ్యకుండానే ఇంత అన్నం నా ముందు పెట్టి, "చాలా?" అంది. అంత అన్నమూ చూచి గుడ్లు మిటకరించిన నాకు ఆమె తిరిగి రెండు గిన్నెలు చూపిస్తూ, "మజ్జిగా, చారా?" అనగానే ఒళ్లు మండింది. "నన్ను చంపక అవి అక్కడ పెట్టు!" అన్నాను. గిన్నెలు గిరవాటేసి చక్కాపోయింది ఆ అమ్మాయి.

వసారాలో మంచం వేసుకుని పడుకున్నాను. ఎండ మిక్కుటంగా ఉన్నా, చెట్లనుండి వచ్చే చల్లని గాలికి కునుకువస్తూంది. కాని, ఏం చెయ్యను? పక్కనే రాజ్యం, విమల, బాబిగాడు ఒకటే రొద చేస్తూ ఆడుకొంటున్నారు. నాకు చిరాకు వేసింది. చటుక్కున లేచి వాళ్ల దగ్గరికి వెళ్లాను. రాజ్యం మామిడి కొమ్మ మీద కూర్చుని పెద్దగా నవ్వుతున్నది. కింద పిల్లలిద్దరూ ఆమెను అందుకునే ప్రయత్నంలో ఉన్నారు.

"కోతిలాగ అలా కొమ్మలెక్కి అరవకపోతేనేం, ఎండపూట మీ అరుపులకు అవతలివాళ్ళ ప్రాణం ఉసూరుమనేలా!" అన్నాను. రాజ్యానికి కోపం వచ్చినట్లుంది. నన్ను ఏమో అనబోయి పట్టుతప్పి కింద కూలబడ్డది. పిల్లలిద్దరూ చప్పట్లు కొడుతూ గొల్లుమన్నారు. నాకూ నవ్వువచ్చి నవ్వేశాను.

దానితో రాజ్యానికి బాగా ఉక్రోషం వచ్చింది. "వాళ్లే! కోతిలాగ!" అనివిసురుగా అక్కడినుండి వెళ్లిపోయింది.

• • •

తరవాత మేము ప్రయాణం అవుతూంటే బాబిగాడికి, విమలకు బొమ్మలు ఇచ్చింది. నేను దగ్గిరికి వెళ్లి, "వానరచక్రవర్తీ, సెలవు" అన్నాను. ఆమె మూతి ముప్పయి ఆరు వంకరలు తిప్పింది.

ఆ తరవాత ఇంటరు సెకండియరులో అక్కడికి వెళ్లటం తటస్థించింది. మొదట రాజ్యం నా స్మృతిపథంలో లేకపోయినా, ఆ ఇంటి చాయలకు వెళ్లేటప్పటికి చప్పున జ్ఞప్తికి వచ్చింది. కాంతమ్మ, "ఏంరా, భాస్కరం! చాలా రోజులకు వచ్చావు! పిల్లలు బాగున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది. నేను ఆమె ప్రశ్నలకు జవాబు

మీ సలహా కోరేవారు వాస్తవంగా వాంఛించేది మీ పొగడ్త మాత్రమే.

— చెస్టర్ ఫీల్డ్

* * *

సాధారణంగా సలహా ఎవరూ సంతోషంగా స్వీకరించరు. ఎవరికి సలహా అత్యవసరమో వారికి అది సుతరామూ కిట్టదు.

— జాన్సన్

చెబుతున్నా, నా కళ్లు రాజ్యంకోసం వెతుకుతున్నాయి. రాజ్యం కనిపించనేలేదు. భోజన సమయంలో కూడా కాంతమ్మే వడ్డించింది. 'రాజ్యం అయిపు లేదేం?' అనుకున్నాను. ఏదయినా దగ్గర అవుదామనుకునే కొద్దీ దూరమైతే, ఆత్రుత ఎక్కువే అవుతుంది. మొదట యథాలాపంగానే రాజ్యాన్ని చూడాలనుకున్న నాతో ఆమె ఎంతకూ కనిపించకపోయేసరికి, 'రాజ్యాన్ని చూడాలి!' అన్న ఆకాంక్ష ఎక్కువై పోయింది. నాకు సహజంగానే ఉన్న చిరాకు ప్రారంభమయింది. ఇలాగ నన్ను ఆత్రుతలో పడవేసినందుకు వీపుమీద రెండు వడ్డించాలని అనిపించింది.

వెంటనే ప్రయాణమయ్యాను. కాంతమ్మ కళ్లు పెద్దవిచేసి, "అదేమిరా, పిచ్చి సన్యాసీ! అప్పుడే బయలుదేరావు?" అంటూ బుగ్గలు నొక్కుకుని, బిందె పుచ్చుకుని బావివద్దకు వెళ్లింది. నేను, 'హతోస్మి!' అనుకొని మళ్లీ కుర్చీలో కూలబడ్డాను.

ఇంతలో పక్క గది గుమ్మంలో గాజుల చప్పుడైంది. తల ఎత్తాను. రాజ్యం! నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. బొద్దులాటి శరీరం, బాగా ఎదిగేటప్పటికి సన్నగా నాజూగ్గా తయారయింది. ముఖంలో ఏదో కొత్తదనం. శరీరంలో ఆ ఒంపులన్నీ ఎప్పుడు కలిగాయో! పరికిణీకి బదులు చీర ధరించింది. ఆమె చిన్నగా మందహాసంచేసి, "విమలా, బాబీ బాగున్నారా? వాళ్లను తీసుకురాలేదేం?" అంది.

"నేనేం పిల్లల పందినా? ఈ ఇంటిలో మొదట వేసే ప్రశ్న ఇదే కాబోలు!" అన్నాను. నాకు ఒళ్లు మండుతూంది, ఇప్పటికి మహారాణిలా దర్శనం ఇచ్చిందని.

ఆ మాటతో రాజ్యం వికృతంగా చూచి, "అవును! ఇంతకంటె నీకు మంచి మాటలు రావు. ఒట్టి...అ ముఖం చూడరాదు!" అనుకుంటూ చేతులు తిప్పుతూ అక్కడినుండి వయ్యారంగా వెళ్లింది.

ఎందుకనో, ఆమెను చూస్తూంటే నాకు ఆకర్షణలాంటి దేదో కలిగింది. ఆ రోజంతా అక్కడే గడిపి మరుదినం వచ్చేశాను.

ఇంటరు పూర్తి అయింది. మెడిసిన్ చదవటానికి మద్రాసులో చేరాను. చేరిన కొద్ది రోజులకు బామ్మకు నిండా జబ్బుగా ఉన్నదని టెలిగ్రాం వచ్చింది. ఏకాయెకీని పరిగెత్తుకు వచ్చాను. రైలు దిగేసరికి పొద్దుపోయింది. పది గంటలు దాటవస్తూంది. ఆ వేళలో బామ్మగారి ఊరు వెళ్లటం కష్టమే. మామూలుగా కాంతమ్మ ఇంట మకాం వెయ్యవలసి వచ్చింది.

కాంతమ్మ వంట ప్రయత్నం చెయ్యబోయింది. "బడలికగా ఉంది. ఇప్పటికి విశ్రాంతిగా పడుకోవటమే మే"లని చెప్పి ఆమెను బలవంతాన నివారించి పడుకున్నాను. అయిదు నిమిషాలైన వెనక, "అమ్మా! ఇవి అయినా ఇవ్వవే" అని రాజ్యం కాబోలు అనటం వినిపించింది. కాంతమ్మ ఒక ప్లేటు నిండా మామిడి పండు ముక్కలు, గ్లాసుతో పాలు తెచ్చి పెట్టింది. రాజ్యం అతిథి మర్యాదకు, పైపెచ్చు నా మీద చూపిన ఆప్యాయతకు సంతోషం వేసింది. తిని పడుకున్నాను.

మనస్సు ఆందోళనగా ఉన్నది. 'బామ్మకెలా ఉన్నదో! పాపం వృద్ధురాలైంది. ఇంక చాలాకాలం బతకదు కూడా. అయినా బామ్మ ఇంకొద్దికాలమైనా ఆరోగ్యంగా జీవించాలి' అని కోరుకుంటూ నిద్రపోవడానికి ఉపక్ర

మించాను. కాంతమ్మ ఆ పక్కనే పడుకొని గుర్రుపెడుతూంది. రాజ్యం గదిలో పడుకుంది కాబోలు అనుకోగానే చటుక్కున నా మనస్సు రాజ్యం మీదికి పోయింది.

'ఇప్పుడు చాలా రాత్రి అయింది. రాజ్యం ఏం చేస్తూందో? నిద్రపోతూండచ్చు. వెళ్లి ఒక్కసారి చూస్తే...' అనుకున్నాను. నాకు రాజ్యం మీద ఎలాంటి దురభిప్రాయంలేదు. కాని, నాకు కలిగిన ఈ కోరిక వింత అయింది. ఒక్కొకసారి మనిషికి కలిగే ఆలోచనలకు అర్థం ఉండదు కాబోలు!

మెల్లిగా లేచి వెళ్లాను. గది తలుపు వేసి ఉన్నది. కిటికీగుండా చూచాను. బెడ్‌లైటు వెలుగుతూంది. రాజ్యం నేను అనుకున్నట్లు నిద్ర పోవటం లేదు, సరికదా గదిలో అటు ఇటు పచారు చేస్తున్నది. ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను.

"ఏం చేసేది? ఎల్లా మనస్సు విప్పి చెప్పేది? ధైర్యం చేసి మాట్లాడబోయినా, కొంటెమాటలతో ఉడికిస్తారు. ఈ పాడు సిగ్గు నన్ను మోసం చెయ్యదుకదా? రేపే వెళ్లిపోతారు. బహుశా ఇక కనిపించరు కూడా నేమో! ఎప్పుడూ దగ్గిరే ఉండి, అందమైన వారి క్రాపులో వేళ్లు దూర్చాలని ఉంది. అబ్బ! డాక్టరు కాబోతున్నారు కదూ! ఎంత హుందాగా కనిపిస్తున్నారు!..." ఇలా తనలో తన్మయంగా అనుకొంటూ మురిసిపోతున్న రాజ్యం ధోరణికి నేను గొప్పగా ఆశ్చర్యం పొందాను. నేను కలగంటున్నానా అనిపించినది. ఇంత స్వల్ప పరిచయానికే రాజ్యం నాతో ప్రణయ బాంధవ్యం కోరుకుంటూందని ఊహించలేక పోయాను. వెళ్లి పడుకున్నానే గాని, నాకు ఇదంతా సినిమా రీలులాగా నా మనస్సులో మెదలసాగింది.

కాకపోతే ఏమిటిది? కాంతమ్మ కుటుంబానికీ మాకూ ఎలాంటి సంబంధ బాంధవ్యాలూ లేవు ఏదో పూర్వకాలంనుండి దూరి పరిచయం మాత్రమే. కాంతమ్మ భర్త బ్రతికి ఉండగా ఏదో వ్యాపారం చేస్తూ బామ్మగారి ఇంట ఆర్థిక సహాయం పొందుతూ ఉండేవాడట. అతను చనిపోయిన తరవాత ఎక్కువ భాగం అప్పులే మిగిల్చిపోయాడట. చాలామంది వ్యాపారస్థులు హఠాత్తుగా పోతే వాళ్ల కుటుంబాల పరిస్థితులు ఇలాగే పరిణమిస్తాయి.

ఆ తరవాత అంతాపోను మిగిలిన దానితో, తన ఒక్క కూతురుతో కాంతమ్మ కాలం వెళ్లబుచ్చుతూంది. ఇంతకూ రాజ్యం నన్ను ప్రేమించిందని తల్చుకుంటేనే వింత కలుగుతూంది. ప్రేమకు డబ్బూ, కులమూ, ఇంకా ఇతర అడ్డంకులూ అక్కరలేదు కాబోలు! నాకు కూడా రాజ్యం రూపం తలుచుకుంటే తియ్యని భావం కలిగింది. నిజంగా ఆ చిలిపి పిల్ల జీవితాని కంతటికీ తోడుగా ఉంటే! అనిపించింది. అంతలోనే చచ్చేటంత భయం కూడా కలిగింది. ముఖ్యంగా, ఆర్థికంగా మా కంటె ఎన్నో రెట్లు లోటుగా ఉన్న వీరితో అమ్మ, నాన్న, మేనమామ సంబంధం అంగీకరించరు. ఊహూం. అది జరగని పని. అలా అనుకొని ఆలోచనలన్నీ గుటుక్కున మింగివేసి కళ్లుమూసుకుని పడుకున్నాను.

ఉదయాన్నే ప్రయాణమై వెడుతున్న నన్ను, వచ్చే కన్నీటిని కూడా తుడుచుకోకుండా కిటికీలో నిలబడి చూస్తున్నది రాజ్యం. ఆ ప్రేమ పిపాసికి శాంతి కలిగేలా, సూచనప్రాయంగానైనా నా అభిప్రాయం తెలియజెయ్యకుండానే వెళ్లిపోయాను. ఏం చెయ్యను? వట్టి అశక్తుడను.

ఆత్రంగా వాకిట్లో అడుగు పెట్టిన నాకు బామ్మ మృతదేహం మాత్రం కనిపించింది. అనుకోని ఈ సంఘటనకు నిశ్చేష్టుడనైనాను. సెలవు ఉన్నా, విచారం నిండుకున్న మనస్సుతో బామ్మలేని ఇంటిలో ఉండలేక మరుదినమే వెళ్లిపోయాను.

అంతే. కాలక్రమేణ రాజ్యం నా స్మృతిపథం నుండి పూర్తిగా మాయమైంది. అది జరిగి ఇప్పటికి అయిదేళ్లు. అప్పటి రాజ్యానికి ఇప్పటి ఈమెకూ ఎంత తేడా! మరి ఈమె పేరు లక్ష్మి... ఓహో! ఔను ఈమె పూర్తిపేరు రాజ్యలక్ష్మి.

● ● ● ●

రాజ్యం భోజనంచేసివచ్చి తల్లిపక్కనిలుచున్నది మందహాసం చేస్తూ. "డాక్టరు గారికి అమ్మ సొది వినిపించలేదు కదా?" అన్నది. నేను తలఎత్తి ఆమె ముఖంలోకి పరీక్షగా చూచాను. అదే ప్రశాంతత ఆమె ముఖంలో. నర్సుగా నాకు పరిచయమైన మూర్తిమాత్రమే అది. మునుపటి రాజ్యం పూర్తిగా మరుగుపడినట్లున్నది ఆమెలో.

"ఏంచెయ్యను,నాయనా! అందరిలాగే అన్ని ఆశలతో ఒక శుభముహూర్తాన ఈమెకు పెండ్లి చేశాను. అన్ని విధాల అనుకూలమైన భర్త లభించి కూడా నిర్భాగ్యురాలయింది. పెళ్లి అయిన మూడు నెలలకే టైఫాయిడ్ వచ్చి చచ్చిపోయాడు" అని, నిట్టూర్చింది కాంతమ్మ.

ఇంక రాజ్యం ముఖంలోకి చూడలేకపోయాను. రాజ్యం జీవితం ఇలా కావటానికి నేనే కారణమేమో అని బాధపడ్డాను ఆ క్షణంలో.

తన్ను నేను గుర్తించిన తరవాత కూడా రాజ్యం నా ముందు ముభావంగానే ప్రవర్తించసాగింది. కనీసం నేను పరిచయం ఉన్న వ్యక్తిగానయినా భావించినట్లు అగుపించటం లేదు. మరోచిత్రం! ఇప్పటి తన దీన పరిస్థితికి ఏమాత్రం మారినట్లు కనిపించక ధైర్యంగా మనోబలంతో ఉన్న ఆమెను చూచి వింత పడకుండా ఉండలేకపోయాను.

ఒక రోజున, "రాజ్యం, ఈ రోజున నాకోసం అరగంట ఇస్తావా? నీతో మాట్లాడాలి" అన్నాను.

ఆమె, "అలాగే" అన్నట్లు తలఊపి తిరిగి తన పనిలో నిమగ్న అయింది, "ఎందుకు? ఏమిటి?" అని కూడా అడగకుండా. అతి సహజం అన్నట్లు నా కోరికకు తలఊపిన ఆమె చర్య నాకు ఆశ్చర్యం కలిగించక పోలేదు. ఆ మాటకువస్తే ఆమె నాకు ఆశ్చర్యం కలిగించని క్షణమేది?

ఆకాశంరంగు వాయిల్ చీరతో, ఆమె వెన్నెల వెలుగులు నింపుకున్నట్లుగా ఉన్నది. పగలంతా మడిచి కట్టిన తల వెంట్రుకలతో జారుగా జడ అల్లినందున, స్వేచ్ఛగా వీపున జీరాడుతూంది. ఎదురుగా ఉన్న స్కూల్ భవనం మీది గడియారం వంక చూస్తూ చెట్టుకింద ఇసకలో కూర్చుంది రాజ్యం. నేను ఆమె కెదురుగా రాతి బెంచి మీద కూర్చున్నాను. రోడ్డు కావల ఉన్న పార్కులో రేడియో వార్తలు ప్రసారం చేస్తూంది

నేను మనస్సు చిక్కబట్టుకున్నట్లు పెదవి కదిలించాను. "రాజ్యం! నీ ముఖంలో విషాదచ్ఛాయలు కూడా వెన్నెల నీడల్లాగ వింత అందాన్ని ప్రసాదిస్తున్నాయి" అన్నాను, ఆమెను ఏకాగ్రంగా చూస్తూ.

రాజ్యం గడియారం వైపే చూస్తున్నది. నా మాటకుమాత్రం జవాబుగా, "నిజమే,డాక్టర్! అమ్మకు హృద్రోగం. శక్తికొద్ది మందులు వాడుతూనే,ఉన్నాను. కాని తగ్గుముఖం పట్టలేదు" అంది. నిర్లిప్తంగా ఉన్న ఆమెను విస్మయపడి చూడటం నా వంతు అయింది.

'ఏమిటీమె? నా ఉద్దేశం గ్రహించి కూడా నా మాటల ధోరణి మరో విధంగా తిప్పుతూన్నదా? ఏమో! ఈ పెంకిఘటం నాకు ఎరుక లేదు అనుకున్నదేమో!' కసిగా అనుకున్నాను.

"అది కాదు, రాజ్యం. కేవలం మీ అమ్మగారి రుగ్మతేనా నీ విషాదానికి కారణం?"

"కాక!?" విస్మయంగా నేత్రాలు తెరిచి, అమాయకంగా నన్ను చూడగానే బిక్కచచ్చిపోయాను. అయినా మొండిగా అన్నాను: "నీ నటన నాకు తెలుసులే,రాజ్యం. అయినా, ఏకాంతంగా నిన్ను కలుసుకున్నది మనస్సులు విప్పి మాట్లాడుకోవటానికిగాని...."

"డాక్టర్! ఏమిటి మీరంటున్నది? మనస్సులు విప్పి మాట్లాడుకోవటం ఏమిటి!" ఆమె ఆశ్చర్య దృక్కులు నాకు ఒళ్లు మండించాయి. "అబ్బ! ఇంక ఊరుకో, రాజ్యం! నీ దృష్టిలో నన్ను డాక్టరుగా కొంచెంసేపు



పల్లెటూరు

చిత్రం—ఎస్. నవమణి (సికిందరాబాదు)

తొలగించి భాస్కరంగా చూడు" అన్నాను.

ఆమె నవ్వింది. "మంచిదే! ఇంతసేపూ నన్ను రాజ్యం, రాజ్యం అని పిలిచింది చాలక, మిమ్మల్ని భాస్కరం అనమంటారా? డాక్టర్ నాతో మాట్లాడాలి, అంటే ఏమిటో అనుకున్నాను. ఇదేనా?"

"నీ అంతర్యుద్ధం మాన్పి, శాంతిపొందాలంటే నా మీద నీకున్న కోపాన్ని తొలగించి శాశ్వతంగా నిన్ను నా—"అని 'ఏ తీయని పదంతో ఆ వాక్యం పూర్తి చెయ్యనా?' అని ఆగాను.

రాజ్యం ముఖం మార్పుచెందింది. "డాక్టర్, నేనేమైనా మీ పేషంటు ననుకున్నారా?" తీవ్రంగా అంది. చటుక్కున నేను ఆమె చెయ్యి అందిపుచ్చుకున్నాను. జాలిగా, "రాజ్యం! కేవలం మన పూర్వపరిచయాన్ని అందిపుచ్చుకొని అయినా నాతో మనసు విప్పి మాట్లాడు. ఎంతసేపు డాక్టర్, డాక్టర్ అని విసిగించకు" అన్నాను.

"చూడండి! మన పూర్వపరిచయానికీ, ఇప్పుడు మీరు మాట్లాడేదానికీ సంబంధం ఏమిటి?" కచ్చితంగా అడిగింది.

"ఇంకా స్పష్టంగా ఎలా చెప్పను? సరే, చెబుతున్నా

(తరువాయి 16 వ పేజీలో)

విను...నీవు, ఊ అంటే, నిన్ను వివాహం చేసుకుంటాను'' అన్నాను. నా మాట వింటూనే ఆమె సంబర పడిపోతుందనీ, తాను ఎదురుచూస్తున్నదేదో నా నోట వినగలిగినందుకు హర్షపులకిత అయి నన్ను చూస్తుందనీ భావించిన నేను రాజ్యం ముఖంచూచి తెల్లబోయాను. ఆమె, తీక్ష్ణంగా నా వైపు చూచి, చివుక్కున లేచింది. నేను కేవలం తనకు పై అధికారిననే భావం సహితం మాయమైనట్లుంది.

''ఇంకేం! బయలుదేరావు ఉద్ధారకుడివి! ఎక్కడినుంచి పుట్టుకు వచ్చింది ఈ త్యాగం? పాపం! ఇక్కడ ఓ పెద్ద సభైనా ఉంటే, నీకు జేజేలు పలికి ఉందురు! వెధవరాలైన ఓ అభాగ్యజీవి నర్సును శ్రీమంతుల బిడ్డ, గొప్ప డాక్టరుగారు ఉద్వాహమాడి పునరుద్ధరించబోతున్నారని కోటి ప్రశంస లందించి ఉందురు.'' ఆమె విసురుగా రెండడుగులు వేసి ఆగి, నా వైపు చూస్తూ, ''డాక్టర్! మీ అనవసర సానుభూతి నా కక్కరలేదు. ఊరికే నన్ను గురించి విచారించి మనస్సు పాడుచేసుకోకండి!'' అని చరచరా వెళ్ళిపోయింది.

అప్పటి నా పరిస్థితి చెప్పడం కష్టం. నిశ్చేష్టుడనై అలా ఎంతసేపున్నానో నాకే తెలియదు. తెప్పరిల్లుకుని చుట్టూ చూచేసరికి, వెన్నెల మాయమై చీకటి ఆవరించి ఉంది. ఇంటికివెళ్ళి భోజనంచేసి పడుకున్నానేగాని, రాజ్యాన్ని గురించిన ఆలోచనలు నన్ను వదిలిపెట్టలేదు.

'రాజ్యాన్ని నేను తప్పుగా అర్థం చేసుకున్నానా?' అనిపించింది. ఊహూఁ. ఎంతమాత్రం కాదు. ఆ రాత్రి రాజ్యం నోటినుండి వెలువడిన మాటలు నన్నుగురించే. మనస్ఫూర్తిగా నా మీద ప్రేమ వెల్లడిస్తూ, కిటికీ ఆవల నిలబడి చూచిన చూపులు మరిచిపోలేకున్నాను. ఆమె ముఖభావం నన్ను మరీ ఆకర్షించి చేతి కందివచ్చిన విలవైన వస్తువేదో అప్పుడు జారవిడుచుకున్నట్లు బాధపడసాగాను. ప్రేమించి చేరరాబోయిన రాజ్యంకన్న తిరస్కరించి దూరంగా పోయిన రాజ్యం నా హృదయం మీద గాఢంగా హత్తుకుపోయింది. ఎలాగైనా, రాజ్యాన్ని ఒప్పించాలని తీర్మానించుకున్నాను. అప్పుడు అస్వతంత్రుడను. ఆమె ప్రేమహృదయాన్ని స్వీకరించి ఆరాధించగల సాహసం అప్పుడు నాకు లేదు. ఇప్పుడు అలా కాదు. నా శక్తిమీద ఆధారపడగలను. అటునించి పెద్దవాళ్ళకి నచ్చచెప్పి ఒప్పించగల ధైర్యం, వివేకం ఉన్నాయి. 'ఈ విషయమే రాజ్యంతో చెబుతాను. ఆలస్యమైనా ఒకనాడు మొట్టమొదటగా తీయని తలపు కలిగించిన రాజ్యమే నాకు భార్యకావటం అదృష్టం' అనుకున్నాను.

అంతేకాని, ఆమె విధవ అనీ, ఆఘ్రాణించబడిన పుష్పమనీ, ఆమెను స్వీకరించి బంధువుల్లో కలతలు, సంఘంలో నవ్వులు సహించవలసి వస్తుందని అన్న ఆలోచనలే నాకు లేవు. ఒకరిచే ప్రేమించబడటం మానవునికి గొప్ప అదృష్టం. అలాంటివారి చేరువనే జీవితం గడపటం మరింత అదృష్టంగా భావించాను.

మరుదినం హాస్పిటల్‌కు వెడుతూండగానే రాజ్యం కోసం నా కళ్ళు వెతికాయి. ఆమె కనిపించలేదు. ఆరోజే కాదు, మరుదినం కూడా అంతే. నా కన్న ముఖ్యంగా రోగులు ఆమె దర్శనంకొరకు పడే ఆరాటం అధికం అయినట్లుంది. ఏమైంది? సెలవు కూడా పంపకుండా రాజ్యం ఏం చేస్తున్నట్లు? బహుశా నన్ను

# రాజ్యలక్ష్మి

(13 వ పేజీ తరువాయి)

సరించి, నేను వెల్లడించిన కోరికను గురించి ఆలోచిస్తూ ఉండిపోలేదు కదా? నాలో ఆశారేఖ పొడచూపింది. ఆమె నాకోరిక తీర్చటానికే నిర్ణయించుకుంటే? సంతోషంతో మనస్సు ఉరకలు వేసింది. నీటుగా తయారై ఆమె అందమైన క్రాపు అని మురిసిన క్రాపు సగిషీగా దువ్వుకొని హాస్పిటల్‌లో అడుగు పెట్టాను.

తెల్లని దుస్తులు ధరించి ఎర్రని గులాబి పువ్వువలె ప్రశాంత మూర్తిలా అరుదెంచే రాజ్యం ఆ రోజూ అంతులేదు. నా మనస్సు చివుక్కు మన్నది. వరసగా మూడు రోజులు ఆమె ఏమైనట్లు? నాలోని ప్రశ్నకు జవాబు అన్నట్లు చిన్న కుర్రవాడు ఒకడు చేత ఉత్తరం కాబోలు పట్టుకుని వచ్చి, నా బల్లమీద ఉంచుతూ, ''లక్ష్మి అక్కయ్య ఇమ్మంది'' అంటూనే అక్కడనుండి తుర్రుమన్నాడు.

'లక్ష్మి వ్రాసిన ఉత్తరం! ఏమని వ్రాసిందో!' ఆనందోద్వేగం, ఒక విధమైన తమకం నన్నావరించి ఉత్తరం పట్టుకున్న చేతులు కొద్దిగా వణికాయి. ఆప్యాయంగా ఉత్తరం మడత విప్పాను.

''డాక్టర్! భగవంతుని సృష్టిలో, నా జీవితమే ఒక కఠిన ప్రశ్న. ఒకటికి రెండు సారులు నా జీవితపు వెలుగుబాటలు చెరిగిపోయాయి.

''ఆ నాటి రాత్రి నా గది కిటికీవద్ద చప్పుడైతే వచ్చి చూచాను. నీవు నా మాటలు విన్నట్లు తెలుసుకుని గాభరా పడ్డాను. తరవాత నా మనస్సు నీకు విశదమైందనీ, దాని పరిణామం నీవే యోచిస్తావనీ ఆశించి నిద్రపోయాను. అనుక్షణం నీ దర్శనంకోసం, కనీసం నీ చల్లని ఉత్తరంకోసం ఎదురుచూచిచూచి విసిగి పోయాను. మనస్సు తెలిసిఉన్నా, పురుషుడవై ఉన్నా 'కాదు, అవును' అని తెలిపేందుకు కూడా నీకు సాహసం లేకపోయింది. తరవాత, నా భర్త నీ చదువు సంధ్యలు లేకపోయినా, నీలా అందగాడు కాకపోయినా, అమాయకమైన అవ్యాజానురాగంతో నన్ను పూర్తిగా మార్చివేశాడు. విద్యాజ్ఞానాలు కలిగి, హృదయం ఎరిగి, కలిమిలేములను, ఇంకా ఇతర విషయాలను పాటించిన నీ కంటె, నా హృదయాన్ని పూర్తిగా ప్రాణాధికంగా ప్రేమించిన వారిని చూచి ఆశ్చర్య పోయాను.

''ఆయన రోగంతో మంచం పట్టినప్పుడు అహర్నిశలూ సేవచేసి నా హృదయ మాలిన్యాన్ని తొలగించుకున్నాను. మంచంలో ఉంటూ, వారు చెప్పేవారు—'లక్ష్మీ! అర్ధాంతరంగా నిన్ను విడిచి పోతున్నాను. విధి విలాసం! కాని, నేను పోయిన తరవాత ఏ యువకుడైనా నిన్ను పరిగ్రహించ కోరవచ్చు. అభ్యుదయ పలుకులంటూ ప్రగల్భాలు కొట్టేవారిలోని స్వార్థాన్ని నీవు గ్రహించి జాగ్రత్తపడు. వయస్సులోని వ్యామోహాలకు లోబడి వ్యక్తిత్వాన్ని బలిచేసుకోకు!' అని.

''అలాగే ఇద్దరు తటస్థపడ్డారు. ఇప్పుడు నీవు! ఇంతకూ నేను అంటూన్న దేమిటంటే, ఒకప్పుడు నేను కన్యను. నిండు మనస్సుతో నీ సేవ కోరాను. కాని, నీవు మౌనం వహించావు. ఇప్పుడు నన్నెందుకు కోరుతున్నావు, డాక్టర్? అందంకలిగి సంపదకలిగి అన్ని విధాలా యోగ్యం అయిన యువతి నీకు భార్యగా లభించగలదే? మరి నన్నే ఎందుకు కోరుతున్నావు, డాక్టర్? జవాబు నన్ను చూచి జాలిపడి, అంటావు కాబోలు! అంతేకదూ, డాక్టర్? నీ జాలి నాకు వద్దు. అపారమైన అనురాగాన్ని చవిచూచినదానను. స్వల్పకాలమైనా ఒక అపురూప హృదయంమీద హాయిగా విశ్రమించిన దానను. ఇప్పుడు నీ జాలి నాకెందుకు? నీ దయా దాక్షిణ్యాలతో బరువు బ్రతుకు గడపటం సులభమా? అందుకే నిన్ను తిరస్కరించాను. మా వారు ఇంకొక మాటకూడ చెప్పారు. కేవలం యువకులను మాత్రమే ప్రేమించరాదనీ, పిల్లలూ, పెద్దలూ అవసరమైతే జంతువులనూ కూడా ప్రేమించమనీ.

''ఈ ఉత్తరం వ్రాయడం కూడ అంత అవసరం అనిపించలేదు నాకు. కాని నన్ను లక్ష్మిని అనుకుని కొన్ని హృదయాలు నన్నుగురించి ఆరాటపడవచ్చు. అందుకే వ్రాస్తున్నాను.

''అమ్మ నిన్నటి దినం చనిపోయింది. నేను పోసే మందులు ఆమె హృద్రోగం మాన్పి, జీవింపజెయ్య లేకపోయాయి. శాంతి ప్రసాదించే మరో లోకానికి పయనమై పోయిందామె. ఇంక నేను చాలాదూరంగా పోతున్నాను. దేశంకోసం పోరుసల్పుతూ క్షతగాత్రు లయ్యే సైనికులకు నా సేవ అప్పుడు అవసరం అవుతుంది.

ఇట్లు
రాజ్యలక్ష్మి.''

ఉత్తరం పూర్తిగా చదివి నిశ్చేష్టుడనైన నా చేతి నుండి అది జారి కింద పడిపోయింది. ★

శిలల కిలకిలలు

ఫోటో—కె. వి. రామమోహనరావు (భువనేశ్వర్-1)

